# రివాల్వర్ ఎత్తుకెళ్లి.. అత్తను కాల్చి..

- గుండ్లసింగారం ఘటనపై కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ విచారణ
- కానిస్టేబుల్ ప్రసాద్‌పై చోరీ కేసు

కోటపల్లి, అక్టోబర్ 12 : హన్మకొండ జిల్లా గుండ్ల సింగారంలో అత్తను రివాల్వర్‌తో కాల్చి హతమార్చిన ఘటనలో కోటపల్లి పోలీస్ స్టేషన్ నుంచి కానిస్టేబుల్ ప్రసాద్ రివాల్వర్‌ను చోరి చేసి ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. గతంలో ఆయన ప్రవర్తన సరిగా లేకపోవడంతోనే గోదావరిఖని నుంచి కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చాడు. బుధవారం రాత్రి తనకు వారెంట్ కావాలని అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ అధికారిని అడిగినట్లు సమాచారం. ఆయుధ కర్మాగారంలో ఆ బుక్ ఉండగా, తాళం చెవి తీసుకొని ఆ గదిలోకి వెళ్లిన ప్రసాద్ వారెంట్ బుక్‌తో పాటు ఎస్ఐ రివాల్వర్ తీసుకొని వెళ్లినట్లుగా అనుమానాలు వెలువడుతున్నాయి. రాత్రి సమయంలో ఈ ఘటన జరగడం, పోలీస్ స్టేషన్ నుంచి రివాల్వర్ తీసుకొని వెళ్లిన ప్రసాద్ గుండ్లసింగారంలో తన అత్త కమలను హతమార్చడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కాగా ఘ టనా స్థలంలో అత్త కమల అక్కడికక్కడే చనిపోగా, స్థానికులు ప్రసాద్‌ను చితకబాదినట్లు సమాచారం.


కానిస్టేబుల్ ప్రసాద్

**కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో డీసీపీ విచారణ**

కోటపల్లి కానిస్టేబుల్ ప్రసాద్ తన అత్తను రివాల్వర్‌తో కాల్చి చంపడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ విచారణ చేపటారు. మంచిర్యాల డీసీపీతో పాటు జైపూర్ ఏసీపీ మోహన్ కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఐ షార్ట్ వెపన్ ఎలా అదృశ్యమైంది.. ఆ సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు సేకరించినట్లు తెలిసింది. కాగా ప్రసాద్ పై చోరీ కేసు నమోదైంది.

## జాతీయ స్థాయిలో మెరిసిన కోటపల్లి విద్యార్థి

- వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ
- ఆకట్టుకున్న ప్రాజెక్ట్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 11: జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో కోటపల్లి మండలం అన్నారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి జుమ్మిడి మణిప్రసాద్ ప్రతిభ చూపాడు. పలువురు అభినందించారు.



**పాజెక్టు వివరాలు...**

వర్షం, పశువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు... గ్రెయిన్ ప్రొటెక్టర్ ఫ్రం రెయిన్ అండ్ యానిమల్స్

**విద్యార్థి పేరు :** జిమ్మిడి మణిప్రసాద్, కోటపల్లి మండలం అన్నారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల **గైడ్ టీచర్ పేరు** : ఎస్ సురేందర్, ఎస్ఏ భౌతిక రసాయన శాస్త్రం.

రైతు తాను కష్టపడి పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు మొదట ఆరబెడుతాడు. అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తుంటాడు. ఆ సమయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం రాకపోతే కేంద్రాల్లోనే ఉంచాల్సి వస్తుంది. అకాల వర్షం వస్తే ధాన్యాన్ని వెంటనే తడవకుండా తరలించడం, ఎత్తడం కష్టమవుతుంది. తడిస్తే గిట్టుబాటు ధర రాక రైతు నష్టపోవాల్సి వస్తుంది. అలాగే ఆరబోసిన ధాన్యం చుట్టూ కంచె లేకుంటే పశువుల పాలవుతుంది. దీంతో కూడా నష్టం వాటిల్లుతుంది. దీనిని నివారించడానికే ఈ 'గ్రెయిన్ ప్రొటెక్టర్ ఫ్రం రెయిన్ అండ్ యానిమల్స్' ప్రాజెక్టు ఇది.

**పని చేసే సూత్రం :** ద్రవాల విద్యుత్ వాహకత(తడి సెన్సార్‌పై)తో పనిచేస్తుంది.

**కావాల్సిన పరికరాలు :** కర్రలు (గుంజలు), ప్లాస్టిక్ పైపులు, కవర్లు, రెయిన్ సెన్సార్, మోటర్ ప్రోగ్రామింగ్ మైక్రో కంట్రోలర్, సోలార్ ప్లేట్, 12వీ బ్యాటరీ ఇనుప తీగ, బజార్ 1.5వీ బ్యాటరీలు.

**పని చేసే విధానం:**

ధాన్యం ఆరబోసే ప్రాంతంలో రెండు వైపులా ఏటవాలుగా ఉండేటట్లు కర్రలు(గుంజలు), ప్లాస్టిక్ పైపులతో పందిరి (గుడిసె)లా ఏర్పాటు చేయాలి. దీని లోపల నేల కొంచెం ఎత్తుగా నిర్మించాలి. దానిపై కవర్ వేసి ధాన్యం ఆరబోయాలి. దీని పై భాగంలో ఒక మైక్రో కంట్రోలర్‌కి కలుపబడిన రెయిన్ సెన్సార్ అమర్చాలి. కవర్స్ రూలర్‌కి చుట్టి, ఈ రూలర్స్ మైక్రో కంట్రోలర్‌కు కలుపబడిన మోటర్‌కి జత చేయాలి. ఇప్పుడు వర్షం వస్తే వర్షపు చినుకులు రెయిన్ సెన్సార్‌పై పడగానే మైక్రో కంట్రోల్‌కి సమాచారం ఇస్తుంది. మైక్రో కంట్రోలర్ మోటర్‌కి సమాచారం చేరవేయడంతో, అది రొటేట్ అవుతుంది. దీంతో ధాన్యం మొత్తం కప్పబడుతుంది. అలాగే కింద నేల ఎత్తుగా ఉండి కవర్లో ధాన్యాన్ని ఆరబోయడం వల్ల నేలపై పడ్డ నీరు ధాన్యంలోకి రాకుండా దూరంగా వెళ్తాయి. ఈ విధంగా రైతు ఆరబోసిన ధాన్యంలోకి రాకుండా దూరంగా వెళ్తాయి. ఈ విధంగా రైతు తన ఆరబోసిన ధాన్యాన్ని వర్షం నుంచి ఇతర జంతువుల నుంచి రక్షించుకోవచ్చు. దీనిని రైతులు అతి తక్కువ ఖర్చులో పంట పొలాల్లో, ఇంటి వద్ద గాని సులభంగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది 12వీ బ్యాటరీతో పని చేస్తుంది. సోలార్ ప్లేట్లు ఉపయోగించి కరంట్ బ్యాటరీలో నిలువ చేసుకొని వాడవచ్చు. ఈ పద్ధతి రైతులతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లలో సైతం అనుకూలంగా ఉంటుంది.

## ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలన

ఆసిఫాబాద్, అక్టోబర్ 12: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఎస్పీ కే.సురేశ్ కుమార్ పరిశీలించారు. గురువారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న ప్రక్రియను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయం సివిల్, ఏఆర్ విభాగాల్లో ఉద్యోగం సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలతో కూడిన డాక్యుమెంట్ గెజిటెడ్ అధికారుల సంతకంతో కూడిన మూడు సెట్లు, ఆరు ఫొటోలతో పాటు ప్రతి జిరాక్స్‌పై స్వీయ ధ్రువీకరణతో జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో అధికారులకు సమర్పించారు. సివిల్ విభాగంలో 107 మంది అభ్యర్థులు, ఏఆర్ విభాగంలో 73 మంది అభ్యర్థులు ఉద్యోగాన్ని సాధించారు. సివిల్‌కి సంబంధించిన నలుగురు అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కాగా శుక్రవారం ఫైర్ కానిస్టేబుళ్లు, టీఎస్ఎస్పీ వంటి మిగిలిన ఉద్యోగాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారులు, హెడ్ క్వార్టర్స్ ఆర్ఐలు, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్ కుమార్

## ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

సిర్పూర్(టీ), అక్టోబర్ 12 : సాధారణ ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ పకడ్బందీగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంతో పాటు జడ్పీ పాఠశాలలోని మూడు పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ పాఠశాలలో టాయిలెట్లను పరిశీలించి, శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేశ్వర్, ఆర్ఐలు ముబీన్, ఉన్నారు.

## జిన్నింగ్ మిల్లులు సిద్ధం చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, అక్టోబర్ 11: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులు, రవాణా, అగ్నిమాపక శాఖ, కొలతలు తూనికలు శాఖ, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోళ్ల ప్రక్రియపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు కార్యక్రమం ప్రారంభం కాబోతున్న సందర్భంగా కొనుగోలుదారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిన్నింగ్ మిల్లుల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రైతులకు కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ అధికారి గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి గంధం లక్ష్మి, సీసీఐ, తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుడిపై కేసు

రామకృష్ణాపూర్, అక్టోబర్ 12: రామకృష్ణాపూర్‌లోని శ్రీ కోదండ రామాలయం ప్రధాన అర్చకుడు పానిపట్ల చక్రవర్తి ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఓ పత్రికా విలేకరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ బీ రాజశేఖర్ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో పానిపట్ల చక్రవర్తి ప్రధాన పూజారి. పట్టణానికి చెందిన ఏఎన్ఎం వెంకటలక్ష్మికి చక్రవర్తి భార్య శాలినికి మధ్య ఒక ఉంగరం విషయంలో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని అదే కాలనీకి చెందిన ఓ విలేకరి వెంకటలక్ష్మికి సపోర్ట్ చేస్తూ నీపై పోలీసు కేసు పెట్టిస్తానని బెదిరిస్తూ రూ. రెండు లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. ఇవ్వక పోతే అర్చకత్వం చేస్తున్న చక్రవర్తిపై దేవాదాయశాఖకు ఫిర్యాదు చేసి కేసు మోపుతానని బెదిరించడంతో మనస్థాపానికి గురై గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే గమనించిన అతని భార్య, భర్తను మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల దవాఖానకు తరలించింది. తన భర్త చక్రవర్తి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన విలేకరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని శాలిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

## వివరాలను నమోదు చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

ఆసిఫాబాద్,అక్టోబర్ 12: శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం అకౌంటింగ్ టీం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15న అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరణ, 30వ తేదీన పోలింగ్ , డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్, డిసెంబర్ 5వ తేదీ వరకు ఎన్నికల నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక టీం లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటినీ వీడియో సర్వైవ్‌లెన్స్ టీం సభ్యులు రికార్డు చేసి, అకౌంటింగ్ టీం సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటింగ్ టీం నోడల్ అధికారి రాజేశ్వర్, అధికారు లు, తదితరులు పాల్గొన్నారు.

## రెండున్నరేండ్ల జైలు

తాండూర్, అక్టోబర్ 12: ఆటో అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరి మరణానికి కారణమైన డ్రైవర్‌కు బెల్లంపల్లి సివిల్ కోర్టు జడ్జి జనమంచి ముఖేశ్ రెండున్నరేండ్ల జైలు శిక్ష విధించారు. తాండూర్ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం 2015 అక్టోబర్ 20వ తేదీన తాండూర్ ఐబీకి చెందిన పులుగం రాజ్‌కుమార్, పురంశెట్టి కిరణ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గోపాల్‌నగర్ వెళ్లి తాండూర్‌కు తిరిగి వస్తుండగా గ్రామ శివారులో ఎదురెదురుగా అతివేగంగా వస్తున్న ట్రాలీ ఢీకొట్టింది. దీంతో రాజ్‌కుమార్ తీవ్రగాయాల పాలై దవాఖానకు తీసుకెళ్తుండగా, మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం కోర్టులో ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి ముఖేష్ ట్రాలీ డ్రైవర్ బుర్స విజయ్‌కి రెండున్నరేళ్ల సాధారణ జైలు, రూ. 6 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs
★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
నమస్తే తెలంగాణ
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5%
91827 77676, 91827 77679
91827 77671, 91827 77677